కంబాలకొండకు న్యూ లుక్

- 12 ఏళ్ల తరువాత ఆధునికీకరణ
- సమకూరుతున్న సౌకర్యాలు
- ఆహ్లాదానికి పెద్దపీట



సిద్ధమైన పగోడా



నిర్మాణంలో యోగా సెంటర్


ఆరిలోవ: జాతీయరహదారి పక్కన పర్యాటక ప్రాంతం కంబాలకొండ ఎకో టూరిజం పార్కు కొత్తదనం సంతరించుకొంటోంది. సుమారు 12 ఏళ్లకుపైగా శిథిలావస్థకు చేరిన ఈ పార్కు రూపు రేఖలు మారుతున్నాయి. అటవీశాఖ అధికారులు ప్రస్తుతం కంబాలకొండ ఆధునికీకరణపై దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా రెండు నెలలుగా ఇక్కడ అభివృద్ధి పనులు జరుపుతున్నారు. ఈ పార్కును అటవీశాఖ అధికారులు ఇక్కడ పర్యావరణం ఇబ్బంది కలగకుండా సుమారు 200 ఎకరాలలో 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అప్పట్లో ఇక్కడ రకరకాల పక్షులు వాటి కిలకిలరావాలతో సందర్శకులను పలకరించేవి. సందర్శకులకు పలు సౌకర్యాలు కల్పించారు. అప్పట్లో కల్పించిన సౌకర్యాలు సుమారు ఇప్పుడు కనుమరుగయ్యాయి. దీంతో ఈ పార్కులో సందర్శకులకు ఎలాంటి వినోదం, వసతులు లేకుండాపోయాయి. ప్రస్తుతం అటవీశాఖ అధికారులు ఈ పార్కు ఆధునికీకరణపై దృష్టిచారించారు. ఇందులో భాగంగా మూలకు చేరిన సౌకర్యాలను పునరుద్ధరిస్తున్నారు. కొన్నింటికి మరమ్మతులు చేపట్టడం, మరి కొన్ని కొత్తగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే కొన్ని పనులు పూర్తి కాగా.. మరికొన్ని ముగింపుదశలో ఉన్నాయి.



అటవీశాఖ రంగులతో సిద్ధమైన యాంఫీథియేటర్

12 ఏళ్లుగా నిర్లక్ష్యం

సందర్శకులను ఎంతగానో ఆకర్షించే కంబాలకొండ ఎకోటూరిజం పార్కు శిథిలావస్థకు చేరి 12 ఏళ్లు పైగా దాటింది. హుద్‌హుద్ తుఫాన్ కంటే ముందుగానే దీనిలో సౌకర్యాలు మూలకు చేరాయి. హుద్‌హుద్ ధాటికి ఇది మరింత శిథిలమైంది. ఇక్కడ కాటేజీలు వినియోగానికి పనికిరాకుండా పోయాయి. విశ్రాంతి షెల్టర్లు సైతం నేలమట్టమయ్యాయి. హుద్‌హుద్ తుఫాన్‌కు చిన్నాభిన్నం కావడంతో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు ఈ పార్కును సందర్శించి పునరాభివృద్ధి కోసం రూ.12 కోట్లు నిధులు కేటాయించారు. ఆ నిధులను అటవీశాఖ అధికారులు వినియోగించకుండా వదిలేశారు. సరికదా అటవీశాఖనిధులు ఉపయోగించైనా అభివృద్ధి జరపలేదు. దీంతో ఇంతవరకు ఈ పార్కు నిర్లక్ష్యానికి గురైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్కు శిథిలావ్థకు చేరడం, సౌకర్యాలు లేకపోవడంతో కార్తీక మాసంలో సైతం దీన్ని సందర్శించేవారి సంఖ్య తగ్గిపోయి ఆదాయానికి గడిపడింది.



కంబాలకొండలో నిర్మించిన ఉడెన్ డెక్ (మంచె)..

సిద్ధమవుతున్న సౌకర్యాలు

కంబాలకొండ ఎకోటూరిజం పార్కు కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉంది. దీన్ని ఆధునికీకరించడానికి ఇటీవల అటవీశాఖ అధికారులు రూ 1.40 కోట్లు నిధులు కేటాయించారు. ఆ నిధులతో ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. గతంలో సందర్శకుల కోసం పార్కు మధ్యలో నిర్మించిన క్యాంటీన్ శిథిలమైంది. ప్రస్తుతం ఆ క్యాంటీన్‌ను ఆధునికీకరించారు. దీని పైకప్పు పూర్తిగా గడ్డితో ఏర్పాటు చేశారు. దీని ఫ్లోర్ కోసం పలకలు అమర్చారు. దీని ఎదురుగా యాంఫీథియేటర్ ఆధునికీకరించి దానికి రంగులు వేశారు. ఓపెన్‌గా ఉండే దీని చుట్టూ కొద్ది ఎత్తులో గోడలు, సందర్శకులు కూర్చోవడానికి వీలుగా బెంచీలు మాదిరిగా నిర్మాణం చేపట్టారు. గతంలో ఐదు కాటేజీలు ఉండేవి. అవన్నీ శిథిలమయ్యాయి. క్యాంటీన్ సమీపంలో ఉన్న మూడు కాటేజీలకు మరమ్మతులు చేపట్టి పైకప్పు, ఫ్లోర్లు మార్చుతున్నారు. ఇవి రంగులతో సిద్ధమవుతున్నాయి. క్యాంటీన్ పక్కన, బోటింగ్ కొలను ఒడ్డున రెండు ఉడెన్ డెక్‌లు(మంచెలు) పాచి కలపను ఉపయోగించి నిర్మించారు. వీటి పైకి ఎక్కిన సందర్శకులకు కంబాలకొండ అందాలు కనువిందు చేయనున్నాయి. సందర్శకుల కోసం ఐదు చోట్ల కొత్తగా రచ్చ బండలు నిర్మించారు. వీటితో పాటు పలుచోట్ల శిథిలమైన విశ్రాంతి షెల్టర్లకు మరమ్మతులు చేపట్టారు. కొలను సమీపంలో రెండు పగోడాలు నిర్మించారు. దీనికి సమీపంలో యోగా సెంటర్ నిర్మిస్తున్నారు. దీని ఫ్లోరింగ్ పనులు జరిగిపోయాయి. పైకప్పు పనులు జరుగుతున్నాయి. కొద్ది రోజుల్లో ఇది అందుబాటులోకి రానుంది.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న డీఐజీ గోపీనాథ్

ఏయూక్యాంపస్: బీచ్‌కు వచ్చే సందర్శకులకు దాహార్తిని తీర్చే విధంగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆర్కే బీచ్ ఎదురుగా కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ పోస్ట్ వద్ద స్నోవరల్డ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపీనాథ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీసీపీ జి.మధు సూధనరావు, డీఎస్పీ వై.గోవింద రావు తదిరతులు పాల్గొన్నారు. సాగర తీరానికి వచ్చే సందర్శకులకు మంచినీరు, మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో స్నో స్టేషన్ నిర్వాహకులు బి.ప్రమోద్ కుమార్, వేగేశ్న రాకేశ్ వర్మ, చింతల పాటి సత్యదేవ్ తదిరతులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి జాతర ప్రారంభం



రూరల్ తహశీల్దారు కార్యాలయం వద్ద నూకాంబిక అమ్మవారు

ఆరిలోవ: జాతీయ రహదారిని అనుకొని రూరల్ తహశీల్దారు కార్యాలయం ఎదురుగా నూకాంబిక అమ్మవారి జాతర వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని కమిటీ సభ్యులు విద్యుత్ దీపాలు, పచ్చని తోరణాలతో అలంకరించారు. వెటర్నరీ కాలనీ, పాత డెయిరీఫారం, ఇందిరానగర్ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. వేకువ జామునుంచే ఆలయ అర్చకులు అమ్మవారికి జలక్షీర పంచామృతాభిషేకాలు చేశారు. ఈ జాతర వేడుకలు ఉగాది వరకు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా ముగింపు వేడుకల్లో కోలాటం, గరిడి, అగ్ని గుండం తొక్కటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏయూ ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత



శివాజీ పాలెంలో పర్యటిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ఆస్తులెక్కడున్నాయనేది తెలుసుకునేందుకు వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. రిజిస్ట్రార్ ధనుంజయ రావు, రెక్టార్ కిశోర్ బాబు సంబంధిత విభాగాల అధికారులతో కలిసి శివాజీ పాలెంలోని ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఫైన్ ఆర్ట్స్ కాలేజీలను సందర్శించారు. ఆయా ప్రాంగణాల్లో విద్యార్థులు వేసిన శిల్పాలు, వివిధ కళాకృతులను తిలకించారు. శివాజీ పాలెంలో ఉన్న వర్సిటీ ఆచార్యుల నివాస సముదాయాలను, ఇంజినీరింగ్ విద్యార్థినుల వసతి గృహాన్ని పరిశీలించారు. అదే విధంగా ఇంజినీరింగ్ కాలేజీ మైదానం అంతా చూసి, వాటికి సరిహద్దులు ఎక్కడున్నాయనేది సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏయూ ఆస్తుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

క్విజ్ పోటీలో కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: జిల్లా స్థానిక అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీలలో స్థానిక డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్. ఐ.విజయబాబు తెలిపారు. చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో కళాశాలకు చెందిన జయవర్ధన, లోకేష్, సురేష్ ,కుమార్ స్వామిలు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి, నగదు బహుమతులు పొందారన్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. పి.జయ, ఐక్యుఏసీ కో ఆర్డినేటర్ కె. రవిబాబు, అర్థశాస్త్ర విభాగం అధ్యాపకులు సీహెచ్ లక్ష్మి, బి. రాజారావు, సుభాషిణి పాల్గొన్నారు.

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిపై కేసు నమోదు చేయాలి

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఈడీకి విదసం ఫిర్యాదు



కార్యాలయం ఎదుట వినతిపత్రాన్ని చూపుతున్న విదసం నాయకులు

ఎంవీపీకాలనీ: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో కాలిన నోట్ల కట్టల వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదు చేసి విచారణ జరపాలని విదసం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంవీపీ కాలనీ సెక్టార్-1లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సౌత్ రీజియన్ సబ్‌జోనల్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ నరేంద్రకు ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో ఉంచిన వివరాలు, ఢిల్లీ పోలీసు కమిషనర్ నివేదిక, జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో దొరికిన ప్రాథమిక ఆధారాలు ద్వారా అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేవలం ఆయన్ని ఢిల్లీ హైకోర్టు నుంచి బదిలీ చేస్తే న్యాయం జరగదన్నారు. ఆయన ఇంట్లో కోట్లు విలువచేసే నోట్లు ఎలా వచ్చాయి. ఈ నగదు లావాదేవీల్లో ఎన్ని తీర్పులు భాగమై ఉన్నాయనే దానికి నిజాలు నిగ్గుతేలాలన్నారు. ఈ నేపథ్యంలో ఆయనను అదుపులోకి తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విదసం సహాయ కన్వీనర్లు సోదాసి సుధాకర్, గుడివాడ ప్రసాద్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన



ఆరిలోవ ఎఫ్ఆర్‌యూలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

ఆరిలోవ: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఆరిలోవ ఎఫ్ఆర్‌యూ వైద్యాధికారి అనిత తెలిపారు. ఇక్కడ ఎఫ్ఆర్‌యూ, టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఇక్కడ ఆస్పత్రి నుంచి ముస్తఫాకాలనీ, డ్రైవర్స్‌కాలనీలో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అనిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెండు వారాలు దాటి దగ్గు, జ్వరంతో బాధపడినవారు ఆరోగ్య కేంద్రాన్ని, టీబీ యూనిట్‌ను సంప్రదించాలన్నారు. దానికి సంబంధించిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆయా చోట్ల ఉచితంగా టీబీ పరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌యూ వైద్యులు వెంకటేశ్వరరావు, రాగ సుధ, టీబీ యూనిట్, వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, టీబీ యూనిట్ సిబ్బంది వేములయ్య, లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎంవీపీకాలనీ: ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంవీపీ కాలనీ సమత కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఎంవీవీ మురళీకృష్ణ మాట్లాడుతూ క్షయ వ్యాధి కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవాల్సిన అవసరముందన్నారు.

'రంగస్థలం' వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న ఆంధ్ర యూనివర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు ఆవిష్కరించారు. యూనివర్సిటీ ప్రాంగణంలోని డాక్టర్ కేవీ గోపాలస్వామి ఓపెన్ థియేటర్‌లో తులసి తీర్థం నాటిక, అల్లూరి సీతారామరాజు బుర్రకథ, హాస్య గుళికలు వేణు గానం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ నరసింహారావు తెలిపారు. రంగస్థలం వైభవాన్ని చాటేలా వేడుకలను నిర్వహించాలని వీసీ ఆచార్య రాజశేఖర్ సూచించారు. వేడుకల్లో ప్రతీ ఒక్కరినీ భాగస్వామ్యులను చేయాలన్నారు. గోడ పత్రిక ఆవిష్కరణలో రంగస్థలం ఇంచార్జి విభాగాధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మరపట్ల భాస్కరరావు, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ త్రినాథ రావు, పితాని ప్రసాద్, సంబంగి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రగతిలో ఇగ్నో అధ్యయన కేంద్రాల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ధర్మారావు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ద్వారా అందిస్తున్న దూర విద్యాప్రగతిలో సంస్థ అనుబంధ అధ్యయన కేంద్రాల పాత్ర కీలకమని విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు పేర్కొన్నారు. మంగళవారం ఉషోదయ కూడలిలోని ఇగ్నో ప్రాంతీయ కార్యాలయంలో అధ్యయన కేంద్రాల సమన్వయకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇగ్నో ఎన్నో కొత్త సాంకేతిక మార్గాల ద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఉన్నత విద్యను చేరువచేసేందుకు సేవలు అందిస్తుందన్నారు. విద్యార్థులకు, విశ్వవిద్యాలయానికి మధ్య సమన్వయకర్తలు అనుసంధానంగా వ్యవహరించి లక్షల మంది యువతను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థుల ప్రవేశాలు, భవిష్యత్ వ్యూహ రచనపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కేంద్రం ఉప సంచాలకుడు డాక్టర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యావిధానంపై అవగాహన

ఎంవీపీకాలనీ: డిగ్రీ విద్యావిధానంపై ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం నూతనంగా డిగ్రీ విధానంలో వచ్చిన మార్పులు, సింగిల్ మేజర్ సబ్జెక్టులు, సింగల్ మైనర్ సబ్జెక్టులు ఇలా అనేక వివరాలను కళాశాల విద్యార్థులకు వివరించారు. దీంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, స్కిల్ ఎన్‌హెన్స్‌మెంట్ కోర్సులు, ఆడిట్ కోర్సులు, మల్టీ డిసిప్లెనరీ కోర్సులపైనా అవగాహన కల్పించారు.

ముగిసిన పికిల్ బాల్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ

ఎంవీపీకాలనీ: విశాఖలోని లాసన్స్ బే కాలనీ వేదికగా మూడు రోజులుగా 'బాటిల్ ఆఫ్ ది పాడిల్స్' పేరుతో జరుగుతున్న ఏపీ పికిల్ బాల్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ముగిశాయి. మెన్స్ సింగిల్స్, మెన్స్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహించగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 21, 23, 23 తేదీల్లో ఆయా కేటగిరీల్లో క్రీడాకారులు విజయం కోసం హోరా హోరీగా పోటీ పడ్డారు. మెన్స్ సింగిల్స్‌లో హైదరాబాద్‌కు చెందిన సమీర్ వర్మ, మిక్స్‌డ్ డబుల్స్‌లో విశాఖకు చెందిన అనంత్ అండ్ హర్షిణి, మెన్స్ డబుల్స్‌లో హైదరాబాద్‌కు చెందిన సమీర్ శర్మ, ప్రజీత్‌లు విజేతలుగా నిలిచారు. అనంతరం మంగళవారం సాయంత్రం జరిగిన విజేతల బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం ఇలాంటి అంతర్జాతీయ క్రీడలు నిర్వహణ ద్వారా విశాఖ ఖ్యాతి మరింత పెరుగుతందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా విశాఖ యువత దేశానికి ఖ్యాతి తేవాలని సూచించారు. టోర్నమెంట్ నిర్వాహకులు పూజిత, డాక్టర్ బొత్స సందీప్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పికిల్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు 31లోగా చెల్లించాలి

సీతమ్మధార: పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు మొదటి అర్థ సంవత్సరానికి జూన్ నెలఖారు లోపు, రెండవ అర్థ సంవత్సరానికి డిసెంబర్ నెలాఖరు లోపు చెల్లించని యెడల 2 శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారుల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు పురపాలక సంఘాల్లో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూళ్ల మెరుగునకు ఆస్తి పన్ను , ఖాళీ స్థలాల పన్ను బకాయిలను మార్చి 31లోపు ఒకేసారి ఏకమొత్తంలో చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సదుపాయం పన్ను బకాయిలు లేకుండా వడ్డీ కట్టిన వారందరికీ వర్తిస్తుందని తెలిపారు. సదరు వడ్డీలో 50 శాతం రాబోయే ఆర్థిక సంవత్సరం పన్నులకు జమ కాబడుతుందన్నారు.

స్విమ్మింగ్ పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న వరప్రసాద్

మురళీనగర్: స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని స్విమ్మింగ్ పూల్‌లో వైశాఖి స్పోర్ట్స్ పార్కు, డెకథ్లాన్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. వైశాఖి స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన వారితో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో శిక్షణ పొందిన స్విమ్మర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరికి వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, డెకథ్లాన్ ప్రతినిధి మణికుమార్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో పార్కు కార్యదర్శి పీవీ సూర్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు సీతిని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన ఫుట్‌పాత్



సముద్ర తీరం తరచూ కోతకు గురవుతోంది. అటువంటి సమయంలో తీర ప్రాంతంలో ఇసుక సముద్రంలోకి వెళ్లిపోతుంది. దీని ఫలితంగా తీర ప్రాంతం పూర్తిగా కోతకు గురవుతుంటుంది. ఇదే తరహాలో పోలీస్ మెస్‌కు ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్ కోతకు గురైంది. ఫుట్‌పాత్ దిగువ నుంచి ఇసుక కోతకు గురవుతుండటంతో, నేల కుంగిపోతోంది. ఫుట్‌పాత్‌ను అనుకుని నిర్మించిన ప్రహరీ గోడకు సైతం ముప్పు వాటిల్లే పరిస్థితి ఉంది. గతంలో ఇదే విధంగా ఆర్కే బీచ్ తదితర ప్రాంతాల్లో కోతకు గురవడం, ఫుట్‌పాత్‌లు, రక్షణ గోడ సైతం కూలిపోయాయి. -ఫొటో : సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం